క్లుప్తంగా

విద్యతోనే మహిళల పురోగతి

ఫిరంగిపురం: విద్యద్వారానే మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించవచ్చని సెయింట్ ఆన్స్ పాఠశాల హెచ్ఎం సిస్టర్ ఒట్టి వసంతకుమారి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 500 మార్కులు దాటిన తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 30 మంది ఉన్నారని తెలిపారు. వారిలో డి.కృపారాణి, సుహాన, రమ్యశ్రీనవ్య, సుకన్య, మరియకీర్తి, రఫియా, లక్ష్మీసుకన్య, శ్రావణి, కీర్తన, నమితారెడ్డి, యామిని, అరుణకుమారి, లక్ష్మీ, బ్యూలా, శాంతి, మహాలక్ష్మీదుర్గ, వెళాంగిణిజ్యోతి, పి.శాంతి, ఏంజల్, కరిష్మ, అంజనాదేవి.అనిత, దివ్య, కీర్తనామృత, ప్రసన్నకుమారి, చైతన్య, భార్గవి, రుక్సానా, నోషిన్, త్రివేణిలు ఉన్నారని చెప్పారు. వారిని అభినందించారు.

వసతి గృహంలో సెల్‌ఫోన్లు చోరీ

మంగళగిరి: గుర్తు తెలియని వ్యక్తి వసతి గృహంలోకి ప్రవేశించి సెల్‌ఫోన్లు ఎత్తుకుపోయిన ఘటన గురువారం ఆత్మకూరులో చోటు చేసుకుంది. బాధితులు మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై క్రాంతి కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు... ఎల్‌బీ నగర్(ఆత్మకూరు) ఏపీఎస్‌పీ బెటాలియన్ సమీపంలోని కొప్పెర్ల పీజీ హాస్టల్‌లో స్థానికంగా వివిధ కళాశాలల్లో చదువులు సాగిస్తున్న విద్యార్థులతో పాటు పలువురు ఉద్యోగులు పేయింగ్ గెస్టులుగా ఉంటున్నారు. గురువారం ఉదయం 6గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి వసతి గృహంలోకి ప్రవేశించి గదుల్లో నిద్రిస్తున్న వారి వద్ద నుంచి 3 సెల్ ఫోన్లు అపహరించుకుపోయాడు. వసతిగృహం నిర్వాహకులు సీసీ పుటేజీల ద్వారా ఆగంతకుడిని కనుగొని మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తాడికొండలో 5 నామినేషన్లు దాఖలు



తాడికొండ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారంతో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ నామినేషన్ల గడువు ముగిసింది. తాడికొండ-86 అసెంబ్లీ స్థానానికి మొత్తం 16 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు ప్రకటించారు. చివరి రోజు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మంచాల సుశీల్ రాజా, ఇండియన్ లేబర్ పార్టీ అభ్యర్థిగా దొడ్డా మురలయ్య, జై భీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థిగా జెడా శ్రావణ్ కుమార్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా రావెల ఏసయ్య, గంజి సుజనీ నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిని మేకతోటి సుచరిత 4వ సెట్ నామినేషన్ దాఖలు చేయగా, టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ 4వ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటి వరకు తాడికొండ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 16 మంది అభ్యర్థులు నామినేషన్‌లు వేయగా 24 సెట్ల నామినేషన్ పత్రాలు అందించడం జరిగింది. నేడు అభ్యర్థుల నామినేషన్ పత్రాల స్క్రూటినీ కార్యక్రమం జరగనుంది.

ముగిసిన నామినేషన్ల పర్వం

44 మంది అభ్యర్థులు 76 నామినేషన్లు

మంగళగిరి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు కార్యక్రమం గురువారంతో ముగిసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జి.రాజకుమారి తెలిపారు. మంగళగిరి శాసన సభా నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 44 మంది అభ్యర్థులు 76 నామినేషన్లను దాఖలు చేసినట్లు ఆమె తెలిపారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న అంతర్జాతీయ నృత్య దినోత్సవం గురువారానికి మూడో రోజుకి చేరాయి. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేయగా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కళా మండలం స్వర దీప మహంత, మోహినీ ఆట్టం, రాజీబ్ ఘోష్ (కోల్‌కత్తా), కథక్ (ఇందిరా పరాశరం హైదరాబాద్) కూచిపూడిల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వారిని యువ కళారత పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల చైర్మన్ డాక్టర్ కేఎస్ఆర్ గోపాలన్, డాక్టర్ చైతన్య, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం, కార్యక్రమాల కార్యదర్శి వెంకటగిరి నాగలక్ష్మి, పతకమూరి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి మేలు

- మళ్లీ జగనన్నను సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధం
- వైఎస్సార్ సీపీ తాడికొండ అభ్యర్థి మేకతోటి సుచరిత
- కంతేరు గ్రామంలో జోరుగా ఎన్నికల ప్రచారం



కంతేరు ప్రచారంలో స్థానికులను పలకరిస్తున్న మేకతోటి సుచరిత

కంతేరు(తాడికొండ): ప్రతి కుటుంబానికి మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ తాడికొండ అభ్యర్థి మేకతోటి సుచరిత అన్నారు. గురువారం తాడికొండ మండలం కంతేరు గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఇంటింటికీ తిరిగి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ ప్రజాసంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ఎన్నికలకు వస్తున్నారన్నారు. దేశ చరిత్రలో మేనిఫెస్టోను నూరు శాతం అమలు చేసి, ఎన్నికలకు వెళ్లిన పార్టీ ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. అధికారం అంటే దోచుకోవడం, దాచుకోవడం అనే నిర్వచనానికి స్వస్తి పలికి ప్రతి కుటుంబానికి పెద్ద దిక్కులా ఉంటూ.. వారి బాగోగులు చూసుకున్న సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. నవరత్నాల పథకాల ద్వారా ఆయన పేదలకు ఆర్థికంగా అండగా నిలిచారనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు తన హయాంలో పేదల కోసం చేసిన ఒక్క మంచి పని అయినా ఉందేమో వెనక్కి తిరిగి ఆలోచించుకొని ప్రజలను ఓట్లు అడగాలన్నారు. మంచి జరిగితేనే ఓట్లు వేయండని అడిగిన సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. 175 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనేందుకు ఇంటింటా వస్తున్న ఆదరణే నిదర్శనమన్నారు. బాబు ఒంటరిగా గెలవలేనని తెలిసి ప్యాకేజీలిచ్చి, అనైతిక పొత్తులతో ప్రజలను ఓట్లు అభ్యర్థించేందుకు వస్తున్నారని ప్రజలంతా ఏకమై తరిమికొట్టాలన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో



పేరేచర్ల ఎన్నికల ప్రచారంలో మేకతోటి సుచరిత

ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కిలారి వెంకట రోశయ్యను రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జం మహేష్ బాబు, ఉప సర్పంచ్ కారంకి నరసింహారావు, నంద్యాల సదానందరెడ్డి, చిలువూరి విజయరాజు, సర్పంచ్ మాదాసు రత్న కుమారి, నాయకులు తాళ్ళ శివనాగరాజు, పార్టీ మండలాధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వర రెడ్డి, వైఎస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, తుళ్ళూరు మండల నాయకులు కొప్పుల శేషగిరిరావు, మాజీ యార్డు వైస్ చైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, తాడికొండ మాజీ సొసైటీ చైర్మన్ వంగా పోలారెడ్డి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ..

మేడికొండూరు: ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, చంద్రబాబు అధికారంలోకి వస్తే ఆ పథకాలన్నీ కనుమరుగవుతాయని తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత అన్నారు. గురువారం పేరేచర్లలో ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, గండికోట రసూల్, షేక్ అబ్దుల్లా ఆధ్వర్యంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేళతాళాలతో సుచరితకు ఘన స్వాగతం పలికారు. 2014లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక ఏ హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని సుచరిత మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్ పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ప్రజలకు మంచి జరిగి ఉంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కిలారి వెంకటరోశయ్యను గెలిపించాలని కోరారు. పేరేచర్ల సెంటర్, ఆరో మైలు, లక్ష్మీ నరసింహ కాలనీ, మైనార్టీ కాలనీ, శివపార్వతీ కాలనీల్లో ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కందుల సిద్దయ్య, ముత్యాల బాలస్వామి, షేక్ సుభాని, మన్నవ రాజేష్, కొరివి చెన్నయ్య, కోకా అర్జున్‌రావు, షేక్ బాజీ, చంటి బాజీ, శాంతయ్య, నాగేశ్వరరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు.. రోడ్డు వెంబడి బ్యానర్లు





మోతడక గ్రామంలో రోడ్లపై టీడీపీ అభ్యర్థి స్వాగత బ్యానర్లు

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బ్యానర్లు కట్టిన వైనం
- ఆర్వోకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

తాడికొండ: మండలంలోని మోతడక గ్రామంలో టీడీపీ నాయకులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని మరోసారి యథేచ్ఛగా ఉల్లంఘించారు. గతంలో ఎన్టీఆర్ విగ్రహానికి వేసిన ముసుగును తొలగించి అత్యుత్సాహం ప్రదర్శించారు. అధికారులకు పలువురు ఫిర్యాదులు చేయడంతో అధికారులు ముసుగు వేశారు. ఇప్పుడు పక్క నియోజకవర్గానికి చెందిన పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ నామినేషన్‌కు వెళ్తుండగా.. నిబంధనలు అతిక్రమించి స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేశారు. దీనిపై స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కార్యదర్శిని సంప్రదించగా .. వారికి అనుమతులు ఉన్నాయంటూ తమకు తెలిపారని నాయకులు ఆరోపిస్తున్నారు. మధ్యాహ్నం వరకు బ్యానర్లు తొలగించకుండా ఉంచడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వైఎస్సార్ సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. పక్క జిల్లా, పక్క నియోజకవర్గానికి సంబంధించిన బ్యానర్లు ప్రదర్శించేందుకు ఇక్కడ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని రిటర్నింగ్ అధికారి తెలిపారని వారు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న టీడీపీ నాయకులపై తగిన చర్యలు తీసుకొని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రూ. 2.50 లక్షల నగదు స్వాధీనం



కంతేరు రోడ్డు శ్రీ సిటీ వద్ద స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

తాడికొండ: ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ఎన్నికల అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనధికారికంగా తరలిస్తున్న రూ.2.50 లక్షల నగదును గురువారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. వివరాల మేరకు..ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా.. లాం గ్రామం సమీపంలో షేక్ ఫిరోజ్ అనే వ్యక్తి ఎలాంటి రశీదులు లేకుండా కారులో లక్ష రూపాయలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. కంతేరు శ్రీసిటీ సమీపంలో తాడికొండ గ్రామానికి చెందిన తాడిబోయిన ప్రసాదు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో రూ.1.50లక్షల నగదు తరలిస్తూ సరైన రశీదులు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. పంచనామా అనంతరం తాడికొండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. తదుపరి విచారణ నిమిత్తం సంబంధిత నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు.

మలేరియా నిర్మూలనకు కృషి



ర్యాలీలో పాల్గొన్న ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



మలేరియా దినోత్సవం ర్యాలీలో ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న ఫిరంగిపురం పీహెచ్‌సీ సిబ్బంది

ఫిరంగిపురం: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యాధికారి టి.ఎస్తేరురాణి అన్నారు. మండల కేంద్రంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటరు వద్ద గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా కారక దోమలను అరికట్టేందుకు ఇంటి పరిసరప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. నీటి నిల్వలు లేకుండా వారానికోసారి నీటి తొట్లు శుభ్ర పరుచుకోవాలని సూచించారు. కాల్వల్లో మురుగు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారుసీ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంపీ హెచ్ మేల్ అసిస్టెంట్లు బాబావలి, బాబురావు, విజయ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగళగిరి: మంగళగిరి ఇందిరా నగర్ అర్బన్ హెల్త్ సెంటరులో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ పి.అనూష వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. మలేరియా దోమ కాటు వల్ల వచ్చే ప్రమాదకరమైన వ్యాధి అని, ఆడ అనాఫిలిస్ దోమ మనిషిని కుట్టి శరీరంలోకి ప్లాస్మోడియం అనే వైరస్‌ను విడుదల చేస్తుందని వివరించారు. ఈ దోమకాటు వల్ల ఎర్రరక్త కణాల్లో వైరస్ వృద్ధి చెంది కొద్ది రోజుల్లో మలేరియాకు గురవుతారని చెప్పారు. మలేరియా సోకిన వారికి తీవ్రమైన జ్వరం, చలి, చెమట పట్టడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కడుపులో తిప్పినట్లు ఉండడం, వాంతులు వంటి లక్షణాలు ఉంటాయని వివరించారు. నిల్వ ఉన్న నీటిలో అనాఫిలిస్ దోమలు వృద్ధి చెందుతాయని, ప్రతి ఒక్కరూ నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు కనబడిన వెంటనే సమీపంలో హెల్త్ సెంటర్‌లో ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మంగళగిరి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి మాట్లాడుతూ దోమ తెరలు వాడుకోవడంతో పాటు ఇళ్ల నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ స్నేహరాజు, మలేరియా అధికారి శ్రీమన్నారాయణ, సూపర్ వైజర్లు సాగర్, సైదులు, హెల్త్ అసిస్టెంట్లు నరసింహారావు, వాసు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వివరాల సేకరణకు నేడు ఆఖరు

నెహ్రూ నగర్: ఎన్నికల విధులలో పాల్గొంటున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారం చివరి రోజు అని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కె.రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ని తొలుత ఈ నెల 22వ తేదీలోపు ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఇచ్చిందని, ప్రస్తుతం 26వ తేదీ వరకు గడువు పొడిగించిందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం(94) పరిధిలో ఎన్నికల ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉద్యోగేతరులు (వీడియోగ్రాఫర్స్, డ్రైవర్లు మొదలుగు వారు) వారి ఓటు ఏ నియోజకవర్గంలో ఉన్నప్పటికీ, జీఎంసీలోని ఎలక్షన్ సెల్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ వద్ద ఫారం-12 కు సంబంధించిన వివరాలు అందించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఈ నెల 26వ తేదీ శుక్రవారం లోగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎలక్షన్ సెల్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డెస్క్ లో ఫారం-12(2 కాపీలు) అందించాలని తెలిపారు. ఫారం-12తో పాటు ఓటర్ ఎపిక్ కార్డ్ కాపీ, డ్యూటీ ఆర్డర్ కాపీ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ సిబ్బంది కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటారని వివరించారు.

ఈఎస్ఐ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం



మాట్లాడుతున్న ఈఎస్ఐ అధికారి

తెనాలి: ఈఎస్ఐ విభాగం ఆధ్వర్యంలో గురువారం స్థానిక రామలింగేశ్వరపేటలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలో గల శ్రీ చైతన్య పాఠశాలలు, శ్రీ చైతన్య జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో ఈఎస్ఐ చందాదారులు, కుటుంబ సభ్యులకు నిర్వహించిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, ఈసీజీ వంటి ప్రాథమిక పరీక్షలు చేశారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. డాక్టర్ మాధవి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రేమ్ చంద్, డాక్టర్ ఫణిందర్ వైద్య పరీక్షలు చేశారు. అక్కడే అవగాహన సదస్సును జరిపి ఈఎస్ఐ స్కీము ద్వారా ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య శిబిరానికి 300 పైగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హాజరైనట్టు శ్రీ చైతన్య పట్టణ ప్రిన్సిపాల్స్ బి.తిరుపతిరావు, నన్నపనేని సునీల్‌కుమార్ తెలిపారు. ఈఎస్ఐ సిబ్బంది పర్యవేక్షించారు.

తెనాలిలో కొత్త సినిమా షూటింగ్



తెనాలి: శ్రీ కృష్ణ ఆర్ట్స్ పతాకంపై పట్టణానికి చెందిన దర్శకుడు కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో ఆరంభించిన నూతన సినిమా షూటింగ్ గురువారంతో తొలి షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. తెనాలి, పరిసర ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా వివిధ సన్నివేశాలను చిత్రీకరించారు. ఎడ్యుకేషన్, సైన్స్, పురోగతి అనే అంశాలపై ప్రధానంగా సినిమా ఇతివృత్తం ఉంటుందని రత్నాకర్ తెలిపారు. జులై, ఆగస్టు నెలల్లో మరో రెండు షెడ్యూల్స్‌తో చిత్రీకరణ పూర్తవుతుందనీ, పోస్ట్ ప్రొడక్షన్ పనులు అనంతరం నవంబరులో విడుదల చేస్తామన్నారు. కేజీఎఫ్ ఫేమ్ చైల్డ్ సూపర్ స్టార్ లిటిల్ భాను, మాస్టర్ పుష్కర్‌లు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, బెల్లంకొండ వెంకట్, గోమతి, మధుకర్, వసంత యామిని, రాధ, అలపర్తి వెంకటేశ్వరరావు, గురుబ్రహ్మం, అజయ్ ఇండియన్, లక్ష్మి, తులసి ఇతర పాత్రల్లో నటిస్తున్నారని తెలిపారు. సాధు సుస్మిత, కన్నెగంటి రవి, కె.ధీరజ్‌లు నిర్మాతలు కాగా సినిమాటోగ్రఫీ వరప్రసాద్‌రెడ్డి, ఆర్ట్ వెంకట్, అసోసియేట్ డైరెక్టర్ రమణ, స్టిల్స్ సీహెచ్ శేఖర్, ప్రొడక్షన్ మేనేజర్ మునిపల్లి శ్రీకాంత్‌గా వివరించారు.

నామినేషన్ వివరాలు సేకరణలో ఎలక్షన్ అబ్జర్వర్

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల అబ్జర్వర్ ఎస్పీ కార్తీక గురువారం గుంటూరు తూర్పు (95) రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను, గురువారం అందిన నామినేషన్ల వివరాలను తూర్పు ఆర్ఓ కీర్తి చేకూరిని అడిగి తెలుసుకున్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు 29 మంది అభ్యర్థులు 43సెట్లు వేసినట్లు వివరించారు. తూర్పు నియోజకవర్గంలోని ఓటర్ల సంఖ్య, పోలింగ్ కేంద్రాల సంఖ్య, సమస్యాత్మక కేంద్రాల వివరాల గురించి కీర్తి చేకూరి అబ్జర్వర్‌కు వివరించారు.

పైప్‌లైన్ స్టాక్ దగ్ధం

గుంటూరు రూరల్: నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టం ఏర్పాటు చేసేందుకు ఉంచిన వాటర్ పైపులు మంటల్లో దగ్ధమయ్యాయి. నగర శివారులోని ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలో ఖాళీ ప్లాట్లలో షాపూజీ పల్లంజీ సంస్థకు చెందిన ప్లాస్టిక్ వాటర్ పైప్‌లు స్టాక్‌ను గత కొన్నేళ్లుగా అక్కడే ఉంచారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఘటనపై నల్లపాడు పోలీసులు ఎటువంటి సమాచారం అందలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

చేబ్రోలు: మండల కేంద్రానికి చెందిన షేక్ నాగుల్ మీరా (53) అనే వ్యక్తి తెలంగాణలోని నల్గొండ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రమాదం అనంతరం వడ్లమూడిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అతనిని తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. నల్గొండ పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మహిళల ర్యాలీ

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధితో పాటు దుగ్గిరాల మండలంలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వాడవాడలా ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా ప్రాంతాల్లోని వారికి అందజేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరిస్తూ గురువారం ప్రచారం నిర్వహించారు. పెనుమాక పార్టీ అధ్యక్షు దామేశ్వర్ రెడ్డి, ఉండవల్లి పార్టీ అధ్యక్షుడు దంటు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి జరిగింది? ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ఎలాంటి అభివృద్ధి చేశారో ఆయా ప్రాంతాల ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యను ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఉండవల్లి జేసీఎస్ కన్వీనర్ అనిల్, కళ్ళం పిచ్చిరెడ్డి, బుల్లిబాబు, నక్కా ఆనంద్ బాబు, తోక సత్యనారాయణ, రాజేష్, కళ్ళం సాంబిరెడ్డి, కళ్ళం వెంకట రెడ్డి, భారీగా మహిళలు పాల్గొన్నారు. పెనుమాకలో బొక్కా నాని, భుజంగరావు, అంజిరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ శివారెడ్డి, అన్నూరి ప్రభాకర్, బషీర్ పాల్గొన్నారు.

తాడేపల్లిలో..

తాడేపల్లి పట్టణ పరిధిలో బైపాస్ రోడ్డులోని 2వ వార్డు, మహానాడు 21వ వార్డు, 9, 12, 18 వార్డులలో తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. 2వ వార్డులో బహుళ అంతస్తులో కళ్ళం రాజా, జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలంటూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీఎస్ కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మహానాడులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎన్నో రహదారులు నిర్మించామని, 90 శాతం మురుగు నీటి సమస్యను పరిష్కరించి ప్రత్యేకంగా వాటర్ లైన్ ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. మహానాడు ప్రాంతంలో 95 శాతం అసైన్‌మెంట్ భూములను వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి పక్కా రిజిస్ట్రేషన్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బైపాస్ రోడ్డులో నిర్మించిన రహదారుల గురించి, అలాగే చేసిన అభివృద్ధి గురించి అపార్ట్‌మెంట్ వాసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ చిన్నబోతుల దుర్గారావు, సలాం, కనకసుందరి, భూపతి కిషోర్‌బాబు, మాలకొండారెడ్డి, సుమ్యా, నరసింహారావు, భాస్కరరెడ్డి, గురవయ్య పాల్గొన్నారు.

రేపు శ్రీసాయి రాగ సంగీత కళాశాల వార్షికోత్సవం

నగరంపాలెం: శ్రీ సాయి రాగ సంగీత కళాశాల తృతీయ వార్షికోత్సవం ఈనెల 27వ తేదీ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మునిపల్లె రమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ లైటింగ్ వ్యాపార సంస్థ వి-లైట్స్ సౌజన్యంతో ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శిల్పారామంలో సాయంత్రం వేడుకలు ప్రారంభమవుతాయని, సంగీత ప్రియులు హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

నేడు సుచరిత ఎన్నికల ప్రచారం

ఫిరంగిపురం: మండలంలోని రెండు గ్రామాల్లో శుక్రవారం తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమీనాబాద్ గ్రామంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటలకు హౌస్ గణేష్ గ్రామంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నాలన్నారు.